సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 28 । డిసెంబర్ । 2024



మహిమాన్వితం.. మహాప్రసాదం
శ్రీ ఈశ్వరీదేవి మఠంలో ఆరు రోజుల పాటు కనుల పండువగా నిర్వహించిన ఆరాధన గురుపూజ మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. -8లో



అక్రమ మైనింగ్‌పై అధికారుల పరిశీలన
వేంపల్లె, వేముల మండలాల్లో అక్రమ మైనింగ్‌లు ఉన్నాయని మైనింగ్ విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
28.2/23.1
వాతావరణం
జిల్లాలో శుక్రవారం 23.1 – 28.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

హోరెత్తిన నిరసన



- పెంచిన విద్యుత్ చార్జీలపై వైఎస్సార్‌సీపీ పోరుబాట
- జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో భారీ ర్యాలీలు
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టింది. రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించి, విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, పి. రామసుబ్బారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డా. దాసరి సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఎస్. రఘురామిరెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్‌రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రమైన కడప నగరంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, నగర మేయర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. తొలుత పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ భవన్ వరకూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణకు వినతి పత్రం సమర్పించారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, మాసీమ బాబు, యానాదయ్య, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.
- కమలాపురం నియోజకవర్గంలోని కమలాపురం పట్టణంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో పట్టణంలో పార్టీ కార్యాలయం నుంచి ఎర్రగుంట్ల రోడ్డులో ఉండే విద్యుత్ సంస్థ ఏఈ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఏఈకి వినతి పత్రం సమర్పించారు.



కడపలో భారీ ర్యాలీ చేపట్టిన మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

మండల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, రఘునాథరెడ్డి, జీఎస్ భాస్కర్‌రెడ్డి, వీరారెడ్డి, జెడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, గండి భాస్కర్ పాల్గొన్నారు.

- మైదుకూరు నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి పట్టణంలోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ట్రాన్స్‌కో డీఈ భరణీకృష్ణకు వినతిపత్రాన్ని సమర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డితోపాటు అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మైదుకూరు మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.
- ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని ప్రొద్దుటూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం జరిగింది. పట్టణంలోని వసంతపేట సాయిబాబా ఆలయం నుంచి స్టేట్ బ్యాంకు మీదుగా లాంతర్లు, ప్లకార్డులు చేతబట్టుకుని గాంధీరోడ్డు, మున్సిపల్ రోడ్డు నుంచి ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఈకి వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి పాల్గొన్నారు.
- జమ్మలమడుగుకు నియోజకవర్గంలో జమ్మమడుగు పట్టణంతోపాటు ఎర్రగుంట్లలోనూ విద్యుత్ పోరు విజయవంతంగా కొనసాగింది. జమ్మలమడుగు పట్టణంలో ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సాయిరాం థియేటర్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించారు. తాడిపత్రిరోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం విద్యుత్‌శాఖ ఏడీ రాజగోపాల్‌కి వినతిపత్రం సమర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి హనుమంతరెడ్డి, హాజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసులాజం, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు



పులివెందులలో విద్యుత్ డీఈఈ ప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

- పులివెందుల పట్టణంలో 'పెంచిన కరెంట్ చార్జీలపై వైఎస్సార్‌సీపీ పోరుబాట' పెద్ద ఎత్తున జరిగింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టణంలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి అంబకపల్లె రోడ్డులోని విద్యుత్ సంస్థ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఈఈ ప్రసాద్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మెన్ చిన్నప్ప, పార్టీ నేతలు రవికుమార్‌రెడ్డి, బయపురెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బద్వేలులో ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, నేతలు

- బద్వేలు నియోజకవర్గంలోని బద్వేల్ పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ మైదుకూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం విద్యుత్ ఏడీఈ కుళ్లాయప్పకు వినతి పత్రం సమర్పించారు. బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, సోషల్ వెల్ఫేర్‌బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్‌కుమార్, జెడ్పీటీసీలు గురివిరెడ్డి, చిన్నపోలిరెడ్డి, రామకృష్ణారెడ్డి, దావీదు, ఎంపీపీలు రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మైదుకూరులో నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ప్రొద్దుటూరులో విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు



కమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, పార్టీ నాయకులు

న్యూస్‌రీల్

అంగన్వాడీ సెంటర్లకు సొంత భవనాలు

కడప సెవెన్‌రోడ్స్: అంగన్వాడీ సెంటర్లకు స్థలాలు గుర్తించి సొంత భవనాల్లో నిర్వహించేలా చూడాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళ, శిశు సంక్షేమ శాఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 13 ప్రాజెక్టుల పనితీరు గురించి సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు శాఖ అందించే సేవలు గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కడ ఎక్కువగా నమోదవుతున్నాయో ఆ ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఆ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్, సీడీపీఓలు, డీసీపీయూ, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు 34 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు

కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు పిలుపునిచ్చారు. శనివారం జిల్లాలో 34 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్‌లోని కమలకూరు, మాధవరాయునపల్లి, ఎగువ నల్లటూరు, మహా నందిపల్లి, చెన్నారెడ్డిపేట, బొప్పాపురం, గొంటువారిపల్లిలో సదస్సులు నిర్వహించనున్నారు. అలాగే పులివెందుల రెవిన్యూ డివిజన్‌లోని కొండప్పగారిపల్లి, నాగూరు, మాదూరు, ఇప్పట్ల, లోమడ, ఎర్రబల్లె, తంగేడుపల్లి, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ లోని తొండలదిన్నె, రేగులపల్లె, కాలుట్ల, జె.కొత్తపల్లి, ఉలవపల్లి, ఏటూరు, నేక్ నాంపేట, పెద్దనపాడు, గొరిగనూరు, ఓబులాపురం, రాజుపాలెం, కుచ్చుపాప, కడప రెవెన్యూ డివిజన్ లోని రంపతాడు, వల్లూరు, అక్కాయపల్లి, మిడుతూరు, దర్జిపల్లి, నారాయణరాజుపేట, కొమ్మువారిపల్లి, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయని డీఆర్వో వివరించారు.

పులకించిన పులివెందుల



భారీగా తరలివచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

- మాజీ సీఎం వైఎస్ జగన్ నాలుగు రోజుల జిల్లా పర్యటన విజయవంతం
- రోడ్డు మార్గంలో బెంగుళూరు వెళ్తున్నారని తెలుసుకున్న కేడర్
- ప్రధాన రహదారిపైకి వచ్చి చేరిన అభిమానులు, ప్రజలు
- అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగిన వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప: అభిమాన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు రోజుల పర్యటనతో పులివెందుల పులకించింది. ఆపన్నహస్తం కోసం ఎదురుచూసిన వారికి భరోసా, అభిమానులకు అభయం, కేడర్‌కు ఉత్సాహం నింపింది. పల్లె ముంగిట్లోకి ప్రియతమ నాయకుడు రావడంతో గ్రామీణ ప్రజల ఆనందానికి అవధుల్లేవు. నాలుగు రోజులుగా నియోజకవర్గంలోనే ఉంటూ అటు కేడర్, ఇటు ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. ఈ నేపథ్యంలో పరస్పర అభిమానం పోటెత్తింది. మరోవైపు సమస్యలు వింటూ నేనున్నాను.. అంటూ ధైర్యాన్ని కల్పించారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇలా అభిమాన నాయకుడు, కేడర్ మధ్య పరస్పర అభిమానం, ఆప్యాయతల మధ్య నాలుగు రోజుల పర్యటన ముగిసింది. ఉదయం నుంచి రాత్రి వరకూ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలకు అందుబాటులో ఉన్నారు. కుటుంబ సభ్యులతో క్రిస్మస్ వేడుకలు మినహా నాలుగు రోజులు పులివెందుల వాసులకు అందుబాటులో ఉండడంతో స్థానికులు వేలాది మంది ప్రత్యక్షంగా కలుసుకున్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు

▶▶ వివాహ వేడుకలో..

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఓ వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

▶▶ తరలివచ్చిన శ్రేణులు...

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగు రోజులుగా పులివెందులలో అందుబాటులో ఉన్నారని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కేడర్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతి ఒక్కరూ తమ అభిమాన నాయకునితో కలిసి మాట్లాడాలనే ఉత్సాహాన్ని ప్రదర్శించారు. పలకరించిన ప్రతి ఒక్కరు ఫోటో, సెల్ఫీ కోసం ఉత్సాహం చూపారు. రాత్రి వరకూ ఓపిగ్గా అందరితో మాట్లాడుతూ వారి సమస్యలు ఆలకించారు. జిల్లా వ్యాప్తంగా ముఖ్యనేతలతోపాటు కడప కార్పొరేటర్లు కుటుంబ సభ్యులతో సైతం తరలివచ్చారు. వారందరి యోగక్షేమాలు ఆయన తెలుసుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి సైతం భరోసా నింపారు.



అభిమానులతో సెల్ఫీ తీసుకుంటూ...

తాతిరెడ్డిపల్లెకు ముందే వచ్చిన పండుగ...

తాతిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి వైఎస్ జగన్ హాజరయ్యారు. 30 కిలో మీటర్లు దూరంలో ఉన్న ఆ గ్రామానికి వెళ్లేందుకు ఏకంగా 6గంటల సమయం పట్టింది. అంతటి స్థాయిలో ప్రజలు దారి వెంబడి ఉండిపోయారు. మరోవైపు ఈ కార్యక్రమానికి వైఎస్ జగన్ హాజరవుతున్నారని తెలుసుకున్న తాతిరెడ్డిపల్లె గ్రామస్తులు బంధుగణంతో కలసి భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేశారు. ఇసుకేస్తే రాలనంతగా జనం వచ్చి చేరిపోయారు. రోడ్డుకు ఇరువైపులా రామాలయం వరకూ ఉండిపోయారు. వాహనంపై నుంచి అభివాదం చేస్తూ గ్రామస్తులను ఉత్సాహపరుస్తూ.. మాజీ సీఎం వైఎస్ జగన్ ముందుకు కదిలారు. సంక్రాంతికి ముందే ఈ గ్రామంలో పండుగ వాతావరణం వచ్చి చేరింది.



వైఎస్ జగన్‌తో కరచాలనం చేసేందుకు ఉత్సాహం చూపుతున్న ప్రజలు



వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన అభిమానులు, ప్రజలు

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మణికంఠ (ఫైల్)

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరుకు చెందిన మణికంఠ(28) అనే యువకుడు శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... మణికంఠ తన ఇంట్లో బల్బుకు విద్యుత్ రావడం లేదని సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో గుర్తు తెలియని వృద్ధుడి (65) మృతదేహాన్ని ఈ నెల 26 నుంచి వుంచారు. అతన్ని వెంకటయ్య అనే పేరుతో ఈ నెల 17న ఉదయం కడప నగరంలోని మార్కెట్‌యార్డ్ వద్ద వుంటే స్థానికులు రిమ్స్‌లో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఈ నెల 26న మృతి చెందాడు.

నీటి ట్యాంకర్ అపహరణ

పులివెందుల రూరల్ : పులివెందులలోని ముద్దనూరు రోడ్డు సమీపంలో హెచ్‌పీ గ్యాస్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఎర్రగుడిపల్లికి చెందిన నీటి ట్యాంకర్‌ను శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఇళ్ల నిర్మాణాలకు బేస్ మట్టం నిర్మించేటప్పుడు ట్యాంకర్ ద్వారా లింగదారిబాబు నీళ్లు తోలుతుంటాడు. రెండు రోజుల క్రితం పెట్రోల్ బంక్ సమయంలో బేస్ మట్టం కడుతుంటే అక్కడ నీటి ట్యాంకర్‌ను ఉంచాడు. గుర్తుతెలియ వ్యక్తులు లక్ష రూపాయల విలువ చేసే నీళ్ల ట్యాంకర్‌ను అపహరించినట్లు బాధితుడు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన సుబ్బమ్మ

అట్లూరు : మండల పరిధిలోని లింగాల కుంట దగ్గర గురువారం రాత్రి కారు ఢీకొని సంగటి సుబ్బమ్మ(70) అనే మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల కుంట ఎస్సీ కాలనీకి చెందిన సంగటి సుబ్బమ్మ రోడ్డు దాటుతుండగా బద్వేలు వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలైంది. ఆమెను ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

కడప మీదుగా అజ్మీర్‌కు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : తిరుపతి నుంచి కడప మీదుగా అజ్మీర్‌కు ప్రత్యేక రైలు నడపనున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి రెండో తేదీన (గురువారం) ఉదయం 7 గంటలకు బయలుదేరి నాలుగో తేదీన అజ్మీర్‌కు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. తిరిగి 9వ తేదీన అజ్మీర్‌లో బయలుదేరి శుక్రవారం రాత్రి 11 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. ఈ రైలు రేణిగుంట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు టౌన్, గద్వాల, మహబూబానగర్, కాచిగూడ, ఖాజీపేట, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్, కాగజ్‌నగర్, నాగపూర్, భోపాల్, ఉజ్జయిని మీదుగా అజ్మీర్ స్టేషన్లో ఆగుతుందన్నారు. ఇప్పటికే రిజర్వేషన్ సౌకర్యం కల్పించారని వివరించారు.

ప్యాసింజర్ రైలు నంబర్ మార్పు

తిరుపతి-హుబ్లీ(07657), హుబ్లీ-తిరుపతి(07658) మధ్య నడిచే ప్యాసింజర్ రైలు నంబర్ మార్పు చేశారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 2025 జనవరి 1 నుంచి ఈ రైలు నంబర్లు 57401/57402గా మార్పు చేశారని, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. అలాగే తిరుపతి-హుబ్లీ మధ్య నడిచే ఈ రైలును ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు, అలాగే హుబ్లీ-తిరుపతి మధ్య నడిచే రైలు ఈ నెల 29వ తేదీ నుంచి మార్చి ఒకటో తేదీ వరకు రద్దు చేశారని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళా కారణంగా ఈ రైలును ఆ ప్రాంతంలో నడపనున్నారని వివరించారు.

మహిమాన్వితం.. మహాప్రసాదం



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న మఠాధిపతి తల్లి విజయమ్మ



దేవాలయ వాస్తుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న శిల్ప శాస్త్ర నిపుణులు

బ్రహ్మంగారిమఠం : 'జగన్మాత.. దీవించు తల్లీ' అంటూ భక్తులు వేడుకున్నారు. మహాదేవి ప్రసాదం కోసం వారు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. 'అమ్మవారి ప్రసాదం.. మహిమాన్వితం' అంటూ భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. శ్రీఈశ్వరీదేవి మఠంలో ఆరు రోజుల పాటు కనుల పండువగా నిర్వహించిన ఆరాధన గురుపూజ మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. అమ్మవారికి మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, రాజేశ్వరిదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేసి, విశేషంగా అలంకరించారు. అనంతరం మహాప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మంగారి మఠం, శ్రీఈశ్వరీదేవి మఠం సంప్రదాయాల ప్రకారం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ద్వార పూజ చేశారు. బ్రహ్మంగారిమఠంలో ప్రసాదం తయారు చేసి, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం శ్రీఈశ్వరీదేవి మఠంలో ద్వార పూజ చేశారు. ప్రసాదం తయారు చేసి, మఠంలో రాసిగా పోసి భక్తులకు పంపిణీ చేశారు. ఈ ప్రసాదం దక్కడం తమ భాగ్యమని వారు ఆనంద భరితులయ్యారు. మహా ప్రసాదానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. 'నిద్ర పోవు వారికి, వద్ద లేని వారికి నా ప్రసాదం అబ్బదు' అని కాలజ్ఞాన వాక్యం. వివాహం, సంతానం లాంటి కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. కాశీ గంగ, తిరుమల లడ్డూకు ఎంత ప్రత్యేకత ఉందో మఠం మహానివేదనకు అంత విశిష్టత ఉందని పెద్దల మాట. మఠాధిపతి శ్రీవీరశివకుమార స్వామి ప్రసంగిస్తూ శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన సమయాల్లో శ్రీ ఈశ్వరీదేవి స్వయంగా ప్రసాదం తయారు చేసి, భక్తులకు పంపిణీ చేసేవారని పేర్కొన్నారు. అలాగే అమ్మవారు దేశ పర్యటన సందర్భాల్లో పంపిణీ చేశారన్నారు. ఈ ప్రసాదం స్వీకరించడానికి భక్తులు అమితాసక్తి ప్రదర్శించే వారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి, సంకటితిమ్మాయపల్లెకు చెందిన పోలు ఎరికలరెడ్డి, సుబ్బారెడ్డి, ముక్కమల్ల భాస్కర్‌రెడ్డి, వీరపు ఉమాపతి, సుంకు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ వాస్తుపై అవగాహన

శ్రీఈశ్వరీదేవి మఠంలో దేవాలయ వాస్తుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తెనాలికి చెందిన స్మార్తాగమ వాస్తు జ్యోతిష అధ్యయనపరులు ఇడమకంటి జనార్దన శివాచార్య, ప్రొద్దుటూరు శిల్పిబ్రహ్మ శిల్పశాలకు చెందిన కోరుగొమ్మి గురుబాలబ్రహ్మాచార్యులు, తెలంగాణకు చెందిన వాస్తు శిల్పి సాయిరాం పంజాల దేవాలయ వాస్తుపై వివరించారు. కవి పూసపాటి నాగేశ్వరరావు రచించిన జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి చరిత్రపై పూసపాటి శంకర్‌రావు వ్యాఖ్యానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విని తరించారు.

విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలి

- జగనన్న పాలనలో రూ.48 వేల కోట్ల డిస్కంలకు రాయితీ
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్/టౌన్ : పెంచిన విద్యుత్ చార్జీలను సత్వరమే తగ్గించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పులివెందులలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని చెప్పి 7 నెలల్లో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపారన్నారు. విద్యుత్ డిస్కంలకు రాయితీలు ఇస్తే కరెంటు చార్జీలు తగ్గించవచ్చునని, గత చంద్రబాబు పాలనలో 2014 నుంచి 2019 వరకు రూ.13 వేల కోట్లు మాత్రమే రాయితీలు ఇచ్చారని, వైఎస్ జగన్ పాలనలో రూ.48 వేల కోట్ల డిస్కంలకు రాయితీ ఇచ్చినట్లు చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన ఇవ్వక విద్యార్థులు కష్టాలు పడుతున్నారని, వీటిపై జనవరి 3వ తేదీన నిరసనలు చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, మహిళలకు రూ.18 వేలు రాలేదన్నారు. ఏడు మాసాల్లో లక్ష కోట్లు అప్పు తెచ్చినా హామీలు నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. ఇంత తక్కువ కాలంలోనే అసమ్మతి వచ్చిన ప్రభుత్వం చరిత్రలో లేదన్నారు. రైతుల పొలాలకు మీటర్లు బిగిస్తే నిరసనలు చేసి, ఇప్పుడు మీటర్లు బిగిస్తున్నారని పేర్కొన్నారు. పంట బీమాకు ఇ-క్రాప్ అవసరం లేదన్నారు. ఇప్పుడు ఇ-క్రాప్ చేస్తేనే బీమా ఇస్తామంటున్నారన్నారు. రైతులకు వ్యవసాయ కనెక్షన్ల విషయంలో డబ్బులు చెల్లించినా ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం లేదన్నారు. రైతుల విషయమే కాక ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ 200 యూనిట్లు ఇవ్వడంలో కూడా చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి విద్యుత్‌చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపుతున్నారన్నారు. ఇష్టం వచ్చిన విధంగా హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకపోవడం మీకు సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. దోమలను చంపినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తారేమోనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అడిషనల్ డీఎంఈ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంఈ వెంకటేశ్వరరావు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, వైద్య కళాశాల (రిమ్స్) ఆవరణలో శుక్రవారం అడిషనల్ డీఎంఈ (అకడమిక్) డాక్టర్ వెంకటేశ్వరరావు పర్యటించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, వైద్య కళాశాల, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, మానసిక వైద్యశాల, కేన్సర్ హాస్పిటల్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం వైద్యకళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని విభాగాల హెచ్‌ఓడీలతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక విభాగాల హాస్పిటల్స్‌లలో పని చేస్తున్న సిబ్బంది కొరతపై ఆరా తీశారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని వివిధ విభాగాలలో పని చేస్తున్న వైద్యులు, సిబ్బందిలో కొంత మందిని ప్రత్యేక విభాగాల ఆసుపత్రులలో నియమించుకుని విధులను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. మూడు ప్రత్యేక ఆసుపత్రులలో రోగులకు సక్రమంగా వైద్య సేవలను అందించేలా అవసరమైన సిబ్బంది వివరాలకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి, జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ, కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితురాలి ఇంటికి వైఎస్ విజయమ్మ

ప్రొద్దుటూరు క్రైం : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ శుక్రవారం ప్రొద్దుటూరు గాంధీ రోడ్డులోని చిన్ననాటి స్నేహితురాలు భారతిదేవి ఇంటికి వచ్చారు. భారతిదేవికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇటీవల శస్త్ర చికిత్స చేశారు. ఈ విషయం తెలుసుకున్న విజయమ్మ వారింటికి వచ్చి భారతిదేవి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. భారతిదేవి భర్త డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డితో కొంతసేపు మాట్లాడారు.



భారతిదేవి ఇంటికి వచ్చిన వైఎస్ విజయమ్మ

ఆర్ట్స్ కళాశాలకు న్యాక్ గ్రేడ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)కి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) బీ ప్లస్ ప్లస్ గ్రేడింగ్‌ను కేటాయిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈనెల 18, 19 తేదీల్లో కళాశాలను సందర్శించిన న్యాక్ పీర్ కమిటీ ప్రతినిధులు పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత తాజాగా 2.81 సీజీపీఏతో బీ ప్లస్ ప్లస్ గ్రేడింగ్‌ను ప్రకటించింది. ఈ గ్రేడ్ కళాశాలకు 5 ఏళ్ల పాటు అమలులో ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులందరి సమష్టి కృషితో ఈ గ్రేడ్ సాధ్యమయినట్లు పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు నూతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పోటీ ప్రపంచంలో కొత్త అవకాశాలను పొందాలని కోరారు. కార్యక్రమంలో న్యాక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.రామచంద్ర, ఏఓ కె.వి.రమణరావు తదితరులు పాల్గొన్నారు.

బిందు, తుంపర సేద్య లక్ష్యం చేరుకోవాలి



మాట్లాడుతున్న సూక్ష్మనీటి సాగు పథక పీడీ వెంకటేశ్వరరెడ్డి

కడప అగ్రికల్చర్ : గ్రామీణ ప్రాంత రైతుల పంట పొలాలకు ఏర్పాటు చేసే బిందు, తుంపర సేద్య లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూక్ష్మనీటి సాగు పథక జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ) వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప కలెక్టరేట్‌లోని ఏపీ ఎంఐపీ కార్యాలయంలో బిందు, తుంపర సేద్య లక్ష్యంపై కంపెనీ ప్రతినిధులు, డీలర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 29,300 హెక్టార్లు బిందు, తుంపర సేద్య అమలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికే 21,746 మంది రైతులు 27,768 హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 4072 మంది రైతుల 4780 హెక్టార్లకు పరికరాల మంజూరుకు కలెక్టర్ నుంచి పరిపాలనా అనుమతులను పొందామని తెలిపారు. గ్రామాల్లో బిందు, తుంపర సేద్య పరికరాలు అవసరమున్న రైతులను గుర్తించి వీఏఏఎస్, వీహెచ్‌ఏఎస్, వీఎస్‌ఏఎస్‌లతోపాటు ఎంఐఏడీల ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునేలా డీలర్లు అవగాహన కల్పించాలన్నారు. కంపెనీ ప్రతినిధులు త్వరగా ప్రాథమిక సర్వే పూర్తి చేసి రైతు వాటాను రైతులు నేరుగా పీడీ అకౌంట్‌కు జమ చేయాలన్నారు. కంపెనీ ప్రతినిధులకు గానీ, డీలర్లకు గానీ ఎవ్వరికీ నగదు రూపంలో ఇవ్వరాదని సూచించారు. రైతు వాటా అందిన వెంటనే పరికరాలను అందించాలన్నారు. పరికరాలు అందించే సమయంలో దరఖాస్తు చేసుకున్న రైతులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, ఎంఐ ఇంజినీర్లు, ఎంఐ డీసీలు, జిల్లా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్‌కు త్రైత సిద్ధాంత పుస్తకాల అందజేత



మాజీ సీఎం వైఎస్ జగన్‌కు త్రైత సిద్ధాంత పుస్తకాలు అందిస్తున్న సేవా సమితి సభ్యులు

పులివెందుల టౌన్ : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుక్రవారం త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ సభ్యులు 'త్రైత సిద్ధాంత భగవద్గీత' - 'ద్వితీయ దైవ గ్రంథం'లో రత్న వ్యాక్యాల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలలో జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరాలను తెలుసుకోవడం ద్వారా ధర్మస్థాపన జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు నరహరి, నాగేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పద్ధతుల్లో విదేశాలకు పంపడం నేరం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్ : ఉపాధి కోసం గల్ఫ్, ఇతర దేశాలకు వెళ్లిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్' హాల్‌లో విదేశీ వ్యవహారాల శాఖ, ప్రొటెక్టర్ ఆఫ్ ఇమిగ్రంట్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రిజిస్టర్ ట్రావెల్ ఏజెంట్లు, అన్ రిజిస్టర్ ట్రావెల్ ఏజెంట్లతో నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పేరిట పలువురిని అక్రమ పద్ధతుల్లో విదేశాలకు పంపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. సరైన వీసా, ఇతర డాక్యుమెంట్లతో వెళ్లాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏజెంట్లను మాత్రమే సంప్రదించాలని పేర్కొన్నారు. అలాంటప్పుడే పని చేసే దేశాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా త్వరితగతిన పరిష్కరించేందుకు సకాలంలో జీతభత్యాలు, మెడికల్ ఇన్సూరెన్స్, మెటర్నిటీ, కుటుంబ వైద్య సౌకర్యం, ప్రమాద బీమా లాంటివి అందుబాటులో వుంటాయన్నారు. ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రంట్స్ (పి.ఓ.ఈ) అధికారి అంగర రవికుమార్ మాట్లాడుతూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సురక్షిత, సక్రమ వలసలను ప్రజలకు చేరువ చేసేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏవైనా సమాచారాన్ని ఇబ్బందులు ఎదురైనా, అత్యవసరమైన టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్: 1800113090 లేదా 011-26885021కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎస్‌బీ సీఐ టి.రెడ్డెప్ప, జిల్లాలోని రిజిస్టర్డ్, అన్ రిజిస్టర్డ్ ఏజెంట్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అట్లూరు : బి.కోడూరు మండలంలోని తంగేడుపల్లె గ్రామంలో రెండు నెలల క్రితం టీడీపీ నేతల దౌర్జన్యంలో సర్వం కోల్పోయిన బీసీ వర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడికి పార్టీ అండగా నిలిచింది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం బద్వేలు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరైన వెంకటసుబ్బయ్యకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ చేతుల మీదుగా రూ.4 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తంగేడుపల్లె గ్రామానికి చెందిన ఎ.సుబ్బరాయుడు, ఆయన కుమారులైన వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, సుబ్రమణ్యంలు గత కొన్నేళ్లుగా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా వ్యవహరిస్తున్నారన్న కారణంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సుబ్బరాయుడు కక్ష పెంచుకున్నారని తెలిపారు. వారికి చెందిన సుమారు 5 ఎకరాల పొలంలోని నిమ్మ, జామ చెట్లు, పొలం చుట్టూ వేసుకున్న కంచె, పొలంలో నిర్మించుకున్న ఇంటిని సైతం అర్ధరాత్రి సమయంలో వచ్చి ధ్వంసం చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దౌర్జన్యాలతోపాటు అక్రమ కేసులు బనాయిస్తూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంత వరకు బద్వేలు నియోజకవర్గంలో ఇలాంటి సంస్కృతి లేదని అన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా ఎన్ని దౌర్జన్యాలు చేసినా భయపడేది లేదని, బాధితులకు అండగా నిలుస్తామని తేల్చి చెప్పారు. రాబోవు రోజుల్లో బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, బి.కోడూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల నాయకులు ఓ.ప్రభాకర్‌రెడ్డి, యోగానందరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'వేధింపులకు పాల్పడితే ఊరుకోం'

బద్వేలు అర్బన్ : అధికార బలంతో వైఎస్సార్‌సీపీ నాయకులను, సానుభూతిపరులను వేధింపులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డు కౌన్సిలర్ రమాదేవి మామ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శీలిచెన్నయ్యకు జీవనాధారంగా ఉన్న బంకును తొలగించాలని మున్సిపల్ అధికారులు నోటీసు ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధలతో కలిసి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాలుగా చెన్నయ్య చెన్నంపల్లె సమీపంలోని రోడ్డుకు ఓ వైపున దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడని, కేవలం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్నాడన్న అక్కసుతో అధికార పార్టీ నేతలు మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి దుకాణాన్ని తొలగించాలని నోటీసు ఇప్పించడం దారుణమన్నారు. బద్వేలు పట్టణంలో వందల కొద్ది అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, అలాగే చెన్నయ్యకు సంబంధించిన దుకాణానికి పది మీటర్ల దూరంలోనే పర్మినెంట్ అక్రమ నిర్మాణం ఉందని, వాటిని పట్టించుకోకుండా చెన్నయ్య దుకాణాన్ని మాత్రమే తొలగించాలని పట్టుబట్టడం సరికాదన్నారు. అధికారం ఎప్పటికీ ఒకరికే పరిమితం కాదని, అధికారులు ఆ విషయాన్ని గుర్తు పెట్టుకుని చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు. పట్టణంలో ఉన్న అక్రమ నిర్మాణాలను ముందుగా తొలగిస్తే చెన్నయ్య దుకాణాన్ని తామే దగ్గరుండి తొలగిస్తామని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే పార్టీ లీగల్ సెల్‌కు సంబంధించిన న్యాయవాది నాగిరెడ్డికి కూడా ఫోన్‌లో విషయం తెలిపి న్యాయపరమైన సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, పుత్తాశ్రీరాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయిక్రిష్ణ, ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు శీలిరమాదేవి, రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై అధికారుల పరిశీలన



మైనింగ్‌ను పరిశీలిస్తున్న మైనింగ్, విజిలెన్స్ అధికారులు



అక్రమ తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

వేంపల్లె : వేంపల్లె, వేముల మండలాల్లో అక్రమ మైనింగ్‌లు ఉన్నాయని మైనింగ్ విజిలెన్స్ ఆర్‌ఐ రామసుబ్రహ్మణ్యం, జిల్లా మైనింగ్ ఆర్‌ఐ విమలమ్మ పేర్కొన్నారు. వారికి అక్రమ ముగ్గురాయి మైనింగ్‌లు ఉన్నాయని ఫిర్యాదు రావడంతో శుక్రవారం తమ సిబ్బందితో కలిసి మండలంలోని తాళ్లపల్లె గ్రామ పొలాల్లో ఉన్న మైనింగ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాళ్లపల్లె గ్రామ పొలాల్లో 214బి, 224 సర్వే నంబర్లలో కడపకు చెందిన ఎండీ నియామతుల్లా అనే వ్యక్తి ఎలాంటి లీజు లేకపోయినా అక్రమ మైనింగ్‌ను కొనసాగిస్తున్నాడని ముచ్చుకుంట్ల జగన్మోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. గత 50 ఏళ్ల నుంచి ఫేక్ డాక్యుమెంట్లు చూపిస్తూ రెవెన్యూ, పోలీస్, కోర్టులకు డాక్యుమెంట్స్ ఇవ్వకుండా పక్కదారి పట్టిస్తూ అక్రమ మైనింగ్ చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు.1992లో జీవో ఎంఎస్ నంబర్ 429 ప్రకారం ఎవరైనా లీజులు మంజూరు చేయించుటకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ చేసిందన్నారు. అయితే దీని ఆధారంగా తాటిమాకులపల్లె గ్రామానికి చెందిన ముచ్చుకుంట్ల జగన్మోహన్‌రెడ్డి 214బి, 224 సర్వే నంబర్లలో మైనింగ్ లీజు కోసం 2010న దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆయనకు 2013లో ఆ సర్వే నంబర్లలో ముగ్గురాయి తవ్వకొనుటకు మైనింగ్ లీజు మంజూరైందన్నారు. కాగా నియామతుల్లా అధికార పార్టీ నాయకులతో చేతులు కలిపి 214బీ సర్వే నంబర్‌లో ప్రాంతం నుంచి చొరబడి 214సి సర్వే నంబర్ ప్రాంతంలో అక్రమంగా ముగ్గురాయిని తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 2006లో 214సి, 214డి, 214 సర్వే నంబర్లలో కూడా ముగురాయి తవ్వకొనుటకు లీజు మంజూరైందని తెలిపారు. అయితే నియామతుల్లా అక్రమంగా మైనింగ్ చేస్తుండగా 2010లో హైకోర్టులో కేసు వేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఫైనల్ హియరింగ్ స్టేజీలో ఉందన్నారు. కాగా హైకోర్టు ఇంట్రీమ్ ఆర్డర్ ఇచ్చినా కూడా నియామతుల్లా కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి మైనింగ్ అధికారులను అనుకూలంగా చేసుకుని 214బి సర్వే నంబర్ నుంచి 214సి లోనికి ప్రవేశించి అక్రమ మైనింగ్‌ను కొనసాగిస్తున్నాడని ఆరోపించారు. విజిలెన్స్ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నోటీసులు ఇచ్చారు. అయితే విజిలెన్స్ ఏడీ లేకపోవడంతో కిందిస్థాయి అధికారులు వచ్చి పరిశీలించి మరొక తేదీని ఇచ్చి సర్వే చేస్తామని చెప్పి వెళ్లిపోయారని తెలిపారు. వేంపల్లె, వేముల మండలాలలో 16 చోట్ల లీజు లేకున్నా.. ఉన్నట్లు రికార్డులు సృష్టించి ముగ్గురాయి మైనింగ్ నడుపుతున్నట్లు తెలుస్తోంది. వీరందరూ ఎటువంటి లీజు లేకున్నా ప్రభుత్వానికి శిస్తు కట్టకుండా గండి కొడుతున్నట్లు సమాచారం.

30 నుంచి స్క్రీనింగ్ పరీక్షలు

కడప అర్బన్ : వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాలకు చెందిన కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకానికి సంబంధించి పీఈటీ, పీఎంటీ స్క్రీనింగ్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పలు ప్రధాన సూచనలు చేశారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డి.టి.సి)లో ఈ నెల 30వ తేదీ నుంచి 2025 జనవరి 8 వరకు పి.ఎం.టి, పి.ఈ.టి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులకు హాజరు కావాల్సిన తేదీ, సమయానికి సంబంధించిన హాల్‌టికెట్‌లను ఆన్‌లైన్‌లో వుంచడం జరిగిందని, కేటాయించిన తేదీ, సమయానికి అభ్యర్థులు హాజరు కావాలన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు అటెస్ట్ చేసినవి తీసుకురావాలని పేర్కొన్నారు. రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ వచ్చిన తరువాత జారీ చేసిన కుల, క్రిమీలేయర్ ధ్రువీకరణ పత్రాలను అభ్యర్థులు తీసుకురావాలని తెలిపారు. ఒకవేళ అభ్యర్థులు ప్రైవేటుగా చదివి వుంటే నోటిఫికేషన్ తరువాత జారీ చేసిన రెసిడెన్స్ సర్టిఫికెట్‌ను తీసుకురావాలని వివరించారు.